క్లుప్తంగా

రేపు, ఎల్లుండి నిరసన దీక్ష

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ఏర్పాటు చేసి ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు కల్పించాలంటూ ఈ నెల 10,11 తేదీలలో విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు వర్సిటీ అధ్యయనకేంద్రం ఒప్పంద అధ్యాపకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన దీక్షకు రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం ఒప్పంద సిబ్బంది, విద్యార్థులు తరలి రావాలని కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సేవలు నిలిపివేయటం వల్ల అధ్యయన కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీను ఏర్పాటు చేసి అడ్మిషన్లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సౌత్ జోన్ బాడీ బిల్డింగ్ పోటీలకు దుర్గాప్రసాద్




విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వ విద్యాలయాల బాడీ బిల్డింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టులో తమ కళాశాల విద్యార్థి సి.హెచ్.దుర్గాప్రసాద్ చోటు దక్కించుకున్నట్లు పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.వి.బి.కృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల కానూరులో జరిగిన కృష్ణా వర్సిటీ పోటీల 60 కేజీల విభాగంలో దుర్గాప్రసాద్ పాల్గొని అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారని తెలిపారు. త్వరలో కర్ణాటక రాష్ట్రంలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటాడని వెల్లడించారు. దుర్గాప్రసాద్ తమ కళాశాలలో యోగ ప్రథమ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. దక్షిణ భారత పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని కళాశాల అధ్యక్షులు సి.నాగేశ్వరరావు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వి.బాబురావు, డీన్ రాజేష్ కళాశాల ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో రూ. 2 కోట్ల వ్యయంతో యూజీడీ పనులకు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో రెండు వేల కుటుంబాలు యూజీడీ సమస్యతో బాధపడుతున్నాయన్నారు. దీంతో తాను అధికారులతో మాట్లాడి రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, దేవరపు మాల్యాద్రి, డి. మురళీకృష్ణంరాజు, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ అమల్లో ఉందని, దీనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబు శ్రీనివాస్ అన్నారు. సర్కిల్ 3 పరిధిలోని పబ్లిక్ హెల్త్ సెక్షన్ అధికారులతో ఆయన బుధవారం సర్కిల్ 3 కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ వర్కర్ల అటెండెన్స్, చెత్త తరలించే వాహనాల ట్రిప్‌లు, వెయిటేజ్, చెత్త ఎక్కువగా పడే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి క్లీనింగ్, లిఫ్టింగ్, డిసైన్ఫెక్షన్ చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, ప్లాస్టిక్ విక్రయం, వినియోగంపై జరిమానా, వసూలు చేయాలని, ట్రేడ్ లైసెన్సులు, యాంటీ లార్వల్ యాక్టివిటీస్‌పై స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కు తీసుకున్న చర్యలను సిబ్బందికి వివరించారు. శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ సలీం, సోమరాజు, శానిటరీ, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన వైద్యుల సంఘం నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విజయానంద్‌ను ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కాగా సీఎస్‌ను కలిసిన వారిలో వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీవీ నారాయణరావు, కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జీ, శ్యామ్‌కుమార్, డాక్టర్ భానుకుమార్, డాక్టర్ స్వరూప్‌కాంత్, డాక్టర్ సుధారాణి తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్సు!

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- నిరుద్యోగులకు షాపులు కేటాయించాలని వినతి
- లక్షల్లో ఖర్చు చేసినా చేరుకోని లక్ష్యం



ఉడా కాలనీలో మూతబడివున్న షాపింగ్ కాంప్లెక్స్

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగర శివారు ప్రాంతమైన రాజీవ్‌నగర్ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించడానికి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటుంది. సుమారు 22 ఏళ్ళ క్రితం అప్పటి విజయవాడ- గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ(ప్రస్తుత సీఆర్‌డీఏ) రాజీవ్‌నగర్, ఉడా కాలనీల్లో నివసించే ప్రజానీకం నిత్యావసర సరుకులు, మెడికల్ షాపు, పాలప్యాకెట్ల కోసం దూరం వెళ్లకుండా అందుబాటులో ఉంచేందుకు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించింది. అది కూడా స్థానికుల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు షాపులను నామ మాత్రపు అద్దెకు ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో షాపింగ్ కాంప్లెక్స్‌ను సుమారు 45 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు. అప్పటి నుంచి సంవత్సరాల తరబడి ఖాళీగానే ఉంచడంతో షాపుల షట్టర్లు తుప్పు పట్టడం, శ్లాబుల సిమెంటు పెచ్చులూడటం, ఇనుప చువ్వలు బయటపడటంతో షాపింగ్ కాంప్లెక్సు శిథిలావస్థకు చేరింది. లక్ష్యం నెరవేరక ముందే షాపులన్నీ మరమ్మతులకు నోచుకున్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క నిరుద్యోగికీ ఒక్క షాపు కూడా కేటాయించలేదు. సంబంధిత అధికారులు బహిరంగవేలం నిర్వహించకుండా సంవత్సరాల తరబడి షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉంచడమే తప్ప ప్రజల అవసరాలు తీర్చిన దాఖలాలు లేవు. ఉడాకాలనీ, రాజీవ్‌నగర్‌లతో పాటు కాలక్రమేణ వడ్డెరకాలనీ, వీకర్స్ సెక్షన్ కాలనీలు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతం విస్తరించి వందలాది కుటుంబాలు నివసిస్తున్నా ఆయా కుటుంబాల అవసరాలకు తగిన విధంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను ఉపయోగించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

పాడైపోతున్న షట్టర్లు...

షాపింగ్ కాంప్లెక్స్‌లోని 12 షాపులు మూతబడి ఉంటున్నాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత టీడీపీ ప్రభుత్వం వీజీటీఎం సంస్థను సీఆర్‌డీఏ గా మార్పు చేసింది. షాపులకున్న షట్టర్లు తుప్పుపట్టి కుక్కలు షాపుల్లో నివాసం వుండటం, రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 80 లక్షల రూపాయలు ఖర్చు చేసి మరమ్మతులు చేసి రంగులు వేశారు. కానీ షాపులు మాత్రం వేలం వేయకుండా ఖాళీగా ఉంచారు. పగలు రాత్రి తేడా లేకుండా ఆకతాయిలు షాపింగ్ కాంప్లెక్స్‌ను అడ్డాగా మార్చుకుని అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా షాపులు అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కొంత వరకు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఇప్పటికైన సీఆర్‌డీఏ అధికారులు షాపులను బహిరంగ వేలం నిర్వహించి నిరుద్యోగ యువతీ, యువకులకు కేటాయించాలని కోరుతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి తూట్లు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు తూట్లు పొడుస్తుందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పౌరుడి ఆరోగ్య అవసరాలు తీర్చడమే లక్ష్యంగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసిందని చెప్పారు. దేశమంతా కోవిడ్ మహమ్మారితో ఇబ్బందులు పడుతుంటే... ఏపీ ప్రజలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటికి రెప్పలా కాపాడుకున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి పూర్తి స్థాయి భరోసాని కల్పిస్తూ.. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, 108, 104 సర్వీసుల పెంపు, ఆరోగ్య ఆసరా వంటి కార్యక్రమాల ద్వారా నాణ్యమైన వైద్యాన్ని అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ మానసపుత్రిక అయిన ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్లను ఏకంగా 3,257కి పెంచి.. ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచిత చికిత్స కోసం రూ.13,471 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్సలు జరిగిన 24.59 లక్షల మందికి కోలుకునే సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1,465 కోట్ల మేర సాయం అందించినట్లు వివరించారు. అలాగే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షలు నుంచి రూ. 25 లక్షలకు పెంచడం చారిత్రాత్మకమన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కోటిన్నర కుటుంబాలకు ఆపద్బాంధవి అయిన ఆరోగ్యశ్రీ పథకానికి వెచ్చిస్తున్న మొత్తంలో కోత విధించడానికి.. బీమా పద్ధతిలో పథకాన్ని అమలు చేసేందుకు చూస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య సేవలను ట్రస్ట్ పద్ధతిలో కాకుండా ఇన్సూరెన్స్ విధానంలో అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం నేడు బకాయిల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాలను తేవాలన్న సంకల్పంతో రూ.8,500 కోట్లతో 17 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టగా.. వైఎస్ జగన్ కు ఎక్కడ మంచి పేరు వస్తుందన్న దుగ్ధతో మెడికల్ కాలేజీలను అమ్మేస్తూ నిరుపేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ సాంబయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు వ్యాపార వేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి. సాంబయ్య సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ శాఖల ఆధ్వర్యంలో తరుణీ తరంగాలు సామాజిక సంస్థ సహకారంతో 'యువతకు కెరీర్ గైడెన్స్, స్వయం ఉపాధి పథకాలపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ద్దేశించి ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ సేవలు అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలపైనే ఆధారపకుండా వ్యాపార వేత్తలుగా ఎదగాలని కోరారు. సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి మరి కొంత మందికి ఉద్యోగాలు కల్పించాలని పిలుపునిచ్చారు. నూతన వ్యాపార వ్యవస్థాపకురాలు ఎం. హైమ మాట్లాడుతూ కేవలం పదవ తరగతి చదివిన తాను నేడు పదిహేను మందికి ఉపాధి కల్పిస్తున్నానని తెలిపారు. డ్రెస్ డిజైన్ లను యూట్యూబ్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా ఉద్యోగ కల్పన అధికారి సత్య బ్రహ్మం మాట్లాడుతూ కేవలం సర్టిఫికెట్ల వల్ల ఉద్యోగాలు రావని తగిన నైపుణ్యాలను సంపాదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. శైలజ, తరుణీ తరంగాలు వైస్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్. విద్యఖన్నా, డాక్టర్ జి. నాగేశ్వ రావు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తాము అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో 2024 ఏడాది వార్షిక నివేదికను బుధవారం నగరవాసులకు సమర్పించారు. విజయవాడ నగరాన్ని దేశంలోనే స్వచ్ఛతా నగరాల్లో ఒకటిగా నిలిపామని చెప్పారు. నగరపాలక సంస్థ జనరల్ బడ్జెట్ నుంచి కూడా నిధులు కేటాయించి నగరంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నగరాన్ని సుందరంగా ఉంచేందుకు నిరంతరం గ్రీనరీని పెంపొందిస్తున్నామన్నారు. మూడు సర్కిళ్లలో 21.72 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, ఇందుకు రూ. 23.78 కోట్లు నిధులు ఖర్చు చేయగా, ఇంకా రూ.4.90 కోట్ల విలువ చేసే 4.43 కిలోమీటర్లమేర రోడ్డు నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. ఇంకా నగరం వ్యాప్తంగా 5.45కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ. 6.11 కోట్లు ఖర్చు చేశామని, 5.20 కిలోమీటర్ల మేర రూ. 6.19 కోట్లుతో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయని వివరించారు. నగరంలోని సర్కిల్-1, సర్కిల్-3 ఏరియాల్లోని కొండ ప్రాంతాల్లో మెట్లు, డ్రైయిన్లు, ర్యాంపులు, ల్యాండిగ్‌లకు రూ. 3.56 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.2.19 కోట్ల పనులు చేపట్టబోతున్నామన్నారు. ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రెవెన్యూ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పలు పన్నుల రూపంలో రూ. 160 కోట్లు ఆదాయం గడించిందన్నారు. నగరంలో ఇప్పటి వరకు 2,18,543 ఆస్తిపన్ను అసెస్‌మెంట్లు ఉండగా వాటి నుంచి రూ. 109 కోట్లు, 15097 ఖాళీ స్థలాలపై రూ. 18.46 కోట్లు, 1,18,663 నీటి కనెక్షన్ల నుంచి రూ. 11 కోట్లు నీటి పన్ను, 1,05,993 సీవరేజ్ కనెక్షన్ల నుంచి సీవరేజ్ చార్జీలు రూ. 11 కోట్లు, 10,850 వాటర్ మీటర్ చార్జీల అసెస్‌మెంట్లకు రూ. 6.59 కోట్లు ఆదాయం గడించామన్నారు. నగరంలోని 64 డివిజన్లలో నిరంతరం పారిశుద్ధ్య నిర్వాహణ జరుగుతుందని, ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వీఎంసీకి వాటర్‌ప్లస్, గార్బేజీ ఫ్రీసిటీలో 7 స్టార్ సర్టిఫికెషన్ పొందామని, ఈ ఏడాది డ్రోన్‌ల ద్వారా నిఘా ఏర్పాటు చేసి వ్యర్థాల కుప్పలను తొలగింపు చర్యలు చేపట్టామని, టక్సర్ మెషీన్ ద్వారా కాల్వల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు నగరంలోని మూడు కాల్వల్లో వ్యర్థాలను తొలగిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 12000 మెట్రిక్‌టన్నుల వ్యర్థాలు తొలగించామని మేయర్‌రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. జక్కంపూడి, రామవరప్పాడు రింగ్, కండ్రిక వంటి శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి 10 ప్రదేశాల్లో డ్రోన్ టెక్నాలజీ వినియోగించి యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్నామన్నారు.

ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా ప్రణాళిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు ఎటువంటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారులతో విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీడీఎం.ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ పాల్గొని నగరంలో వీఎంసీ చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. నగరంలోని కుక్కల నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ)ఆపరేషన్లు, రోడ్లపై గుంతలకు మరమ్మతులు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, అన్న క్యాంటీన్ నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాల గురించి సీడీఎంఏ అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, ఇంచార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ పి సత్యనారాయణ, ఇంచార్జ్ వెహికల్ డిపో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏసు పాదం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఎస్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ మూతల్ని రోడ్డు లెవెల్‌కు పెంచాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డుపై ఉన్న మ్యాన్ హోల్ మూతల్ని రోడ్డు లెవెల్‌కి సరిచేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. 23వ డివిజన్‌లోని బీసెంట్ రోడ్డు మహంతి మార్కెట్, కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్, చలసాని వెంకటరత్నం వీధి, ప్రకాశం రోడ్డు, పొగాకు బారెల్ రోడ్డు, కాళేశ్వరం రోడ్డు, ఐవీ ప్యాలెస్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్ ప్రహరీ గోడను వెంటనే పునర్నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. చలసాని వెంకటరత్నం వీధి, ప్రకాశం రోడ్డు, పొగాకు బారెల్ రోడ్డు, కాళేశ్వరం రోడ్డు, ఐవీ ప్యాలెస్ లో సెల్లార్ లో ఉన్న ఫర్నిచర్ తొలగించాలని, మహంతి మార్కెట్‌లో మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక కార్పొరేటర్ బాలస్వామి, ఇంజినీరింగ్, ఎస్టేట్స్, ప్రజారోగ్య విభాగం, ప్లానింగ్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10న సంక్రాంతి బొమ్మల కొలువు ప్రదర్శన



కృష్ణలంక(విజయవాడతూర్పు): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 10వ తేదీన బాలోత్సవ భవన్‌లో సంక్రాంతి బొమ్మల కొలువు ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు ఎ.సునీల్‌కుమార్ తెలిపారు. గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బొమ్మల కొలువు ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ఆధ్వర్యంలో బిర్లా ఓపెన్ మైండ్స్ సౌజన్యంతో జరుగుతుందన్నారు. ప్రవేశం ఉచితమని, బొమ్మల కొలువు ఏర్పాటు చేసుకోవడానికి 30 అడుగుల స్థలం కేటాయిస్తామని చెప్పారు. తల్లీ పిల్లలు కలిసి పాల్గొనవచ్చన్నారు. ఉత్తమ ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. కళలు, సంప్రదాయాలను కొనసాగించడానికి మహిళలను ప్రోత్సహించేందుకు చేసే ప్రయత్నానికి చేయూత ఇవ్వాలని కోరారు. ఆసక్తి కలవారు పేర్లను 93462 93779, 77993 08775 నంబర్లకు వాట్సాప్ చేయాలని సూచించారు.

● ఆత్మీయ కలయిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మల్లాది విష్ణుని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.

విద్యుత్ చార్జీల పెంపుతో రైల్వేకి అదనపు భారం

సీనియర్ డీఈఈ దినేష్‌రెడ్డి



అభ్యంతరాలు వెల్లడిస్తున్న దినేష్‌రెడ్డి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుతో రైల్వేశాఖపై అదనపు భారం పడుతుందని, తద్వారా ప్రజలకు చవకైన ప్రజా, రవాణా సేవలు దూరం అయ్యే ప్రమాదం ఉందని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ డీఈఈ దినేష్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో రైల్వేశాఖ నుంచి దినేష్‌రెడ్డి హాజరై అభ్యంతరాలు తెలియజేశారు. భారత ప్రభుత్వ పాలసీ ప్రకారం కర్బన ఉద్గారాలను తగ్గించే చర్యల్లో భాగంగా రైల్వే నెట్‌వర్క్‌లో డీజిల్ వినియోగాన్ని తగ్గించి విద్యుత్ రైళ్ల వినియోగం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల కారణంగా గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారుగా రూ.270 కోట్ల అదనపు భారాన్ని రైల్వే శాఖ భరించాల్సి వచ్చిందన్నారు. ఈ విధంగా విద్యుత్ చార్జీలు పెంచడంతో రైలు ప్రయాణికులు, పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. భారతీయ రైల్వే దేశంలోని 12 రాష్ట్రాలలో ఓపెన్ ఎక్సెస్ విధానంలో సరసమైన ధరలతో విద్యుత్ కొనుగోలు చేస్తోందని, ఇదే విధానం ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో రైల్వే శాఖ 62 ట్రాక్షన్ సబ్ స్టేషన్‌లతో విస్తరించి రాష్ట్ర సరఫరా సంస్థలకు (డిస్కంలు) సుమారు రూ.రెండు వేల కోట్లకు పైగా వార్షిక ఆదాయాన్ని సమకూరుస్తోందన్నారు. పెరుగుతున్న విద్యుత్ చార్జీల కారణంగా రైల్వే శాఖకు కొత్త ప్రాజెక్టుల రూపకల్పన, తద్వారా అన్ని ప్రాంతాల ప్రజలకు రవాణా సదుపాయాలు కల్పించడం భారంగా మారనుందన్నారు. పొరుగు రాష్ట్రం ఒడిశా మాదిరిగా రిబేటుతో కూడిన చార్జీలు, లేదా తెలంగాణ మాదిరిగా ఆమోదయోగ్యమైన చార్జీలు వేసి రైల్వే శాఖను ప్రోత్సహించాల్సిందిగా దినేష్‌రెడ్డి కోరారు.

రాష్ట్ర రోయింగ్ సంఘ అధ్యక్షుడిగా తరుణ్



రాష్ట్ర రోయింగ్ సంఘం నూతన కార్యవర్గం

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్(ఎస్ఆర్ఏపీ) అధ్యక్షుడిగా తరుణ్ కాకాని (విజయవాడ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో సంఘ వార్షిక సర్వసభ్య సమావేశం వర్చువల్‌గా బుధవారం నిర్వహించారు. సమావేశం అనంతరం జరిగిన సంఘ ఎన్నికల్లో సంఘ ఉపాధ్యక్షుడిగా పి.భాస్కర్‌రెడ్డి (అనంతపురం), పవిత్ర కొండ్రెడ్డి (విజయవాడ), కార్యదర్శిగా ఎన్.పవన్‌కుమార్ (బాపట్ల), సంయుక్త కార్యదర్శులుగా ఆర్.డి.ప్రసాద్ (విజయవాడ), శ్రీనివాస్‌పడి (శ్రీకాకుళం), కోశాధికారిగా పి.లావణ్య (కృష్ణా జిల్లా), కార్యవర్గ సభ్యులుగా పి.సి.మస్తాన్ (కడప), కె.కృష్ణమూర్తి (జంగారెడ్డిగూడెం), జి.కిషోర్ (శాప్, విజయవాడ), రాఘవేంద్ర (కృష్ణాజిల్లా)ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రోయింగ్ మాస్టర్స్ విభాగం పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన తరుణ్ కాకాని సంఘానికి రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. భారత రోయింగ్ సమాఖ్య (ఆర్ఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి పి.శ్రీరామ్, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్, సుప్రీం కోర్టు న్యాయవాది దొడ్డపనేని రమేష్ ఈ ఎన్నికలకు పరిశీలకులుగా వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సంఘం నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగుతుంది. ఆర్ఎఫ్ఐ, ఖేలో ఇండియా సహకారంతో త్వరలో కృష్ణా నదిలో జాతీయ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తామని ఈ సందర్భంగా తరుణ్ కాకాని వెల్లడించారు.

కులధ్రువీకరణ పత్రాల్లో మార్పులు చేయాలి

- ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ శంకర్ నారాయణకు వినతి



బీసీ కమిషన్ చైర్మన్ శంకర్ నారాయణకు వినతి పత్రం ఇస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే విశ్వబ్రాహ్మణుల కులధ్రువీకరణ పత్రాల్లో కొన్ని మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశామని, దానిని పరిగణనలోకి తీసుకుని అభిప్రాయ సేకరణకు సమావేశం ఏర్పాటు చేయటం హర్షణీయమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణుల అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోని విశ్వబ్రాహ్మణులను కంసాలి, వడ్ల, ఆచారి, కమ్మర, అంసుల వంటి పేర్లతో పిలుస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో అదే పేర్లతో కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ గెజిట్‌లో కుల ధ్రువీకరణ పత్రాల్లో బీసీ-బీ, సీరియల్ నంబర్ 21లో ఉన్న విధంగా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) అని మాత్రమే ఉండేలా చూడాలని కోరానని, ఈ మేరకు 2023 జూలై నెలలోనే వినతి పత్రం ఇచ్చానని బీసీ కమిషన్ చైర్మన్ శంకర నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. దానిని ఆధారంగా చేసుకుని ఈ రోజు అభిప్రాయ సేకరణ చేపట్టినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, సంఘీయుల సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తీసుకుని విశ్వబ్రాహ్మణ జాతి గౌరవాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు డాక్టర్ ఎన్.మారేష్, గురువాచారి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి పోరాడాలని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు , తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పిలుపు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడిగా ఐవి సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని రద్దు చేయడంతో జర్నలిస్టులకు ఉన్న కొద్దిపాటి వేతన భద్రత కూడా లేకుండా పోయిందన్నారు. గత పదిహేనేళ్లుగా కొత్త వేజ్ బోర్డును నియమించకపోవడంతో పాత వేతనాలే అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. సెంట్రల్ ప్రెస్ అక్రెడిటేషన్ కమిటీని రద్దు చేశారని , ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్వయం ప్రతిపత్తిని నీరుకార్చారని శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఐవీ సుబ్బారావును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై అభినందనలు తెలిపారు. ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ తాను రెండోసారి ఎన్నికయ్యేందుకు మద్దతు తెలిపిన జర్నలిస్టులకు , ఐజేయు, ఏపీయూడబ్ల్యూజే నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. యూనియన్ నాయకులు సోమసుందర్, చందు జనార్ధన్, ఐజేయు కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు చావా రవి, నల్లి ధర్మారావు, కూన అజయ్ బాబు, కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, దారం వెంకటేశ్వర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జయరాజు, రాష్ట్ర యూనియన్ నాయకులు ఎ .జయప్రకాష్ , కె.మాణిక్యరావు, రామసుబ్బారెడ్డి , సామ్నా ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆప్కో షోరూంలో అన్ని రకాల చేనేత వస్త్రాల కొనుగోలుపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నామని ఆప్కో మండల వాణిజ్యాధికారి డి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయశాలలతో పాటు ఆప్కో హ్యాండ్లూమ్స్.కామ్ అమెజాన్, ఫ్లిఫ్ కార్ట్ వంటి ఆన్లైన్ సంస్థలలోను 30 శాతం ప్రత్యేక రాయితీ అందుబాటులో ఉంటుందన్నారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించడంతోపాటు, ఆప్కో వస్త్రాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా తగ్గింపు ఇస్తామని చెప్పారు. ఆప్కో షోరూమ్ లతోపాటు ఆన్‌లైన్‌లోనూ మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చేనేత చీరలు, బెడ్ షీట్స్, లుంగిస్, టవల్స్ రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమకు చేయూత నందించాలని కోరారు.